క్లుప్తంగా

గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసిన క్యామ మల్లేష్



గుత్తా సుఖేందర్‌రెడ్డితో భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

నల్లగొండ టూటౌన్: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని నల్లగొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ శనివారం కలిశారు. రాజకీయాలకు సంబంధించి వివిధ అంశాలపై సుఖేందర్‌రెడ్డితో చర్చించినట్లు క్యామ మల్లేష్ తెలిసింది.

వాటర్ ఫిల్టర్ అందజేత

మర్రిగూడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శనివారం చౌటుప్పల్ మండల పరిధిలోని దివీస్ ఫార్మ కంపెనీ ప్రతినిధులు రూ.40వేల విలువ గల వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో దివీస్ ఫార్మా కంపెనీ మేనేజర్లు కిశోర్, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీరుడు అంజయ్య, ఉపాధ్యాయులు సుందరయ్య, మంజుశ్రీ, జీవన్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ నియామకం

నల్లగొండ టూటౌన్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ శనివారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా నారాయణ చందీశ్వర్, కంప దుర్గయ్య, దుబ్బాక మల్లేష్, చిట్టిమల్ల శివకుమార్, మునికుంట్ల గణేష్, కొండేటి శేఖర్, ప్రధాన కార్యదర్శులుగా తిరందాసు కనకయ్య, నేతాల వెంకటేశ్‌యాదవ్, కార్యదర్శులుగా తిరుమల మహేష్, కసిరెడ్డి ఆంజనేయులు, బంటు యాదగిరి, కిలారి సైదులు, వంగూరు సైదులు, ఝెన్నం శేఖర్, పోకల దశరథ, కురాకుల రవీందర్‌కుమార్, కోశాధికారిగా బోడ ఆంజనేయులు, సోషల్ మీడియా కన్వీనర్‌గా పంజాల నాగరాజు, కార్యాలయ కార్యదర్శిగా ఆవుల కోటేష్, అధికార ప్రతినిధులుగా సోమగాని దినేష్‌గౌడ్, కుంభం సైదయ్య నియమితులయ్యారు.

కనగల్ అధ్యక్షుడిగా బాలకృష్ణగౌడ్

కనగల్: మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా దోరెపల్లి గ్రామానికి చెందిన మాదగోని బాలకృష్ణగౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు.

కొరటికల్ వాసికి డాక్టరేట్




డాక్టరేట్ అందుకుంటున్న శిరగమల్ల కిషోర్

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన శిరగమల్ల కిషోర్ శనివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ పర్యవేక్షణలో '1946–51 మధ్య కాలంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దళితుల పాత్ర' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను తనకు డాక్టరేట్ లభించిందని కిషోర్ తెలిపారు. కిషోర్‌ను గ్రామస్తులు అభినందించారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

కేతేపల్లి: కేతేపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు గద్దపాటి లచ్చయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన లచ్చయ్య దశదిన కర్మ నిర్వహణ కోసం అతడి కుటుంబ సభ్యులకు శనివారం గ్రామ పంచాయతీ మాజీ కోఆప్షన్ సభ్యుడు చందా రామ్మూర్తి 50 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ సిబ్బంది రూ.5వేలు లచ్చయ్య కుటుంబ సభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఓ సురేందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కారోబార్ గండమళ్ల, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎన్జీఓస్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీఎన్జీఓస్ నేతలు

నల్లగొండ టౌన్: పట్టణంలోని టీఎన్జీఓస్ కార్యాలయంలో శనివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల మురళి, జె. శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజకుమార్, ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, టీఎన్జీవోస్ జిల్లా కోశాధికారి మేడి జయరాజ్, టీజీఓస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, కార్యదర్శి శ్రీనివాస్, టీఎన్జీఓ అసోసియేట్ అధ్యక్షుడు డీడీవి రాజు, ఏడుదొడ్ల వెంకట్రామిరెడ్డి, మామిడాల రమేష్, చోల్లేటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా !

- కొలువుదీరిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు
- చైర్మన్‌గా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు
- కొత్త కమిటీల ఎదుట పలు సవాళ్లు



శిథిలావస్థకు చేరిన బండవారిగూడెం ప్రాథమిక పాఠశాల పైకప్పు

రామగిరి(నల్లగొండ): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచి నాణ్యమైన గుణాత్మక విద్య అందించాలనే ధృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు శ్రీకారం చుట్టింది. గతంలోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు స్వస్తి పలుకుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లో ముఖ్య పాత్ర స్వయం సహాయక సంఘాల బృందాలదే. తల్లులే కమిటీ సభ్యులుగా ఉంటారు.

కమిటీల ఏర్పాటు ఇలా..

తిప్పర్తి మండలంలో ప్రాథమిక పాఠశాలలు 27, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, హైస్కూళ్లు 6 ఉన్నాయి. ఇప్పటి వరకు అన్ని పాఠశాలల్లో కమిటీల ఏర్పాటు పూర్తయింది. వచ్చే విద్యా సంవత్సరం పునః ప్రారంభానికి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే కమిటీల లక్ష్యం. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం తిప్పర్తి మండలంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల స్కూల్ యూనిఫామ్ కుట్టే బాధ్యతను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మతులు, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకురావడం, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదికి విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జూన్ 10 వరకు కల్పించనున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు రూ.25వేల వరకు ఎమర్జెన్సీ నిధులు వినియోగించవచ్చు. పాఠశాలలో చేపట్టిన పనులకు లక్ష రూపాయల వరకు ఎంపీడీఓ పరిశీలించి బిల్లులు చెల్లిస్తారు. రూ.లక్షకుపైగా పనులకు ఎం.బుక్‌లను పరిశీలించి కలెక్టర్ చెల్లిస్తారు. అవసరమైన నిధులు కలెక్టర్ వద్ద అందుబాటులో ఉంటాయి.

కొత్త కమిటీలకు సమస్యల సవాళ్లు

కొత్తగా ఏర్పాటయ్యే కమిటీలకు పలు సమస్యలు సవాల్‌గా మారనున్నాయి. మన ఊరు–మన బడి కార్యక్రమంలో ఎంపికైన పాఠశాలల్లో మినహా అన్ని పాఠశాలల్లో సమస్యలు చాలా ఉన్నాయి. దాదాపు అన్ని పాఠశాలల్లో కరెంటు సరఫరా లేదు. స్కావెంజర్‌లను తొలగించడం వల్ల టాయిలెట్ల నిర్వహణ సరిగ్గా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో ఎంపిక కాబడిన పాఠశాలు మినహాయిస్తే మిగతా పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవు. కొన్ని పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది.

కమిటీల ఏర్పాటు పూర్తి

"తిప్పర్తి మండలంలో అన్ని పాఠశాలల్లో కమిటీల ఏర్పాటు పూర్తయింది. చైర్మన్‌గా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు , ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ప్రతి తరగతిలో ముగ్గురు కమిటీ సభ్యులను ఎంపిక చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ ముగ్గురులో ఒకరు ఎస్సీ, ఎస్టీ కేటగిరికి చెందిన వారిని ఎంపిక చేశాం. ఎన్నికైన కమిటీ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, యూనిఫాం తయారీ, పిల్లల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తారు. మరో వారం రోజుల్లో బ్యాంకు అకౌంట్లు తెరిచే ప్రక్రియ కూడా పూర్తవుతుంది.

– కె. అరుంధతి, ఎంఈఓ, తిప్పర్తి

వసతుల కల్పనకు కృషి



"పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తాం. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా కార్యచరణ రూపొందిస్తాం. వారం రోజుల్లో బ్యాంకు అకౌంట్ తెరుస్తాం. పాఠశాలలో సమస్యలను గుర్తించి పరిష్కారం అయ్యేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. కమిటీ సభ్యుల సహకారంతో పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

–ఆవుల రేణుక,
ఇండ్లూరు పాఠశాల చైర్మన్

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



"మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, పాఠశాలలోని విద్యార్థుల తల్లులతో కూడిన కమిటీ ఏర్పాటు శుభపరిణామం. ఈ కమిటీ ద్వారా ప్రభుత్వం పాఠశాలలకు మరిన్ని నిధులు విడుదల చేస్తే మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని ఆశిస్తున్నాం. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాముఖ్యత ఇవ్వడం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం.

–నామిరెడ్డి మహేందర్‌రెడ్డి,
పీఆర్‌టీయూ తిప్పర్తి మండల అధ్యక్షుడు

కేసీఆర్ అన్ని వ్యవస్థలను నాశనం చేశాడు



మాట్లాడుతున్న వేముల వీరేశం, చిత్రంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

నకిరేకల్: పదేళ్ల తన పాలనలో మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేశాడని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆరోపించారు. నకిరేకల్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్‌పై శుక్రవారం కరీంనగర్‌లో పర్యటనలో కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్ మాట్లాడుతున్న భాషను చూసి తెలంగాణ ప్రజలు ఆశ్చర్యానికి లోనవుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పుతో మైండ్ బ్లాక్ అయ్యి కేసీఆర్ ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడంలేదన్నారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఇష్టానుసారంగా భూమి, ఇసుక దోపిడీకి పాల్పడి ఉమ్మడి జిల్లాను ఎడారిగా మార్చాడని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీసీ ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరావు, కౌన్సిలర్లు గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, వీరార్జున్ రెడ్డి, కొండయ్య, నరేందర్, రమేష్, చౌగోని శ్రీను, ఉగ్గిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' కూలీ పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న నారి అయిలయ్య

చిట్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారి రోజువారి కూలీని రూ.300కు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య డిమాండ్ చేశారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలతో పేదలకు జీవనోపాధి లభించక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి, మండల నాయకులు లడే రాములు, గుండెపూరి యాదమ్మ, ఓర్సు రామచంద్రం, అర్రూరి తిరుమలయ్య, రామలింగయ్య, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి

కనగల్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీపీఎం రామలింగయ్య అన్నారు. శనివారం కనగల్ మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. తేమ శాతాన్ని దృష్టిలో ఉంచుకుని సీరియల్ ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఎండాకాలం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలన్నారు. కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సంకు హరి, సీఆర్‌పీ జానకి పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడే వారిని గెలిపించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నకిరేకల్: ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడు సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నకిరేకల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య కులాలు, మతాల పేరుతో చిచ్చుపెట్టి మనువాద వారసత్వాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను, సహజ వనరులను కార్పొరేట్ పరం చేస్తోందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల, మాజీ ఎంపీపీ మర్రి వెంటకయ్య, మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, నాయకులు సాకుంట్ల నర్సింహ, గింజల లక్ష్మి, కొప్పుల అంజయ్య, వంటిపాక కృష్ణ, పన్నాల శశికళ, పైళ్ల లింగయ్య, దోరేపల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'జన జాతర'కు తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు



సభకు వెళ్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జన జాతర బహిరంగ సభకు నల్లగొండ నుంచి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల నుంచి వాహనాలు బయల్దేరి వెళ్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నల్లగొండ నియోజకవర్గం నుంచి 15వేల మంది వరకు బహిరంగ సభకు తరలివెళ్తున్నట్లు తెలిపారు. తరలివెళ్లిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, సైదులు, సూరెడ్డి సరస్వతి, దుబ్బ రూపా తదితరులు ఉన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



నకిరేకల్: రైతు దీక్షలో మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



చండూరులో నిర్వహించిన రైతు దీక్షలో పాల్గొన్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

నకిరేకల్: కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ శనివారం నకిరేకల్‌లోని మెయిన్ సెంటర్‌లో చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధికంగా ధాన్యాన్ని సేకరించిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. నేడు తెలంగాణ వ్యాప్తంగా నీరు లేక రైతులు అల్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.2లక్షల రైతు రుణమాఫీ, రైతు బంధు రూ.15వేలు, వరికి రూ.500 బోనస్, రైతు కూలీలకు రూ.12వేలు, కౌలు రైతులకు రూ.15వేలు ఇలా ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ వచ్చి రాష్ట్రంలో కరువు తెచ్చిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. రైతులకు మేలు జరిగే వరకు బీఆర్‌ఎస్ పోరాడుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మి, తలారి బలరాం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, మారం వెంకట్‌రెడ్డి, నాయకులు పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, పెండెం సదానందం, సామ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఎండిన వరి పొలాల్లో..
కాంగ్రెస్ నేతలు స్టేడియంలో..

చండూరు: మాజీ సీఎం కేసీఆర్ ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తుంటే, కాంగ్రెస్ నాయకులు స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ వీక్షిస్తూ రైతులను అవమానిస్తున్నారని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చండూరులో శనివారం చేపట్టిన రైతు దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకట్రెండు పథకాలను అమలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తుందని మండిపడ్డారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25,000 నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి రూ.500 ఇవ్వాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ కొట్లాడుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు పోరాటాలు, ఉద్యమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలన్నారు. కార్యక్రమంలో కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ, రైతు సేవా సహకార సంఘం చైర్‌పర్సన్ కోడి సుష్మ, సీనియర్ నాయకుడు మునగాల నారాయణరావు, వైస్ ఎంపీపీ అవారీ గీత, టౌన్ అధ్యక్షుడు భూతరాజు దశరథ, యూత్ అధ్యక్షుడు ఉజ్జిని అనిల్‌రావు, మండల ఉపాధ్యక్షుడు కురుపాటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్



నల్లగొండ టూటౌన్: టిఫిన్ బైటక్‌లో పాల్గొన్న మాదగాని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



బీజేపీ జెండా ఎగురవేస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి, చిత్రంలో శానంపూడి సైదిరెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: బూత్ స్థాయిలో కార్యకర్తలందరూ సమష్టిగా పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్ అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు మిర్యాల సత్యనారాయణ పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం బండారు ప్రసాద్ నివాసంలో టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ బూత్‌లకు సంబంధించి మెజార్టీ ఓట్లను రాబట్టే విధంగా కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం పార్టీ స్థాపించినప్పటి నుంచి ఉన్న నాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రావిరాల వెంకట్, కొప్పు యాదన్న, కొప్పు జయశ్రీ, పవన్‌కుమార్, బూతరాజు విశ్వనాథ్, కర్నాటి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో బీజేపీది చెరగని ముద్ర

నల్లగొండ టూటౌన్: దేశాభివృద్ధిలో బీజేపీది చెరగని ముద్ర అని ఆ పార్టీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం నల్లగొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాగం వర్షిత్‌రెడ్డి బీజేపీ జెండా ఎగురవేశారు. అనంతరం పండిట్ దీన్ దయాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 400 సీట్లు గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పోతెపాక లింగస్వామి, మిర్యాల వెంకటేశం, పకీరు మోహన్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, చింతా ముత్యాల్‌రావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రావెళ్ల కాశమ్మ, దాసోజు యాదగిరాచారి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నల్లగొండ మండలంలోని ఎం. దుప్పలపల్లి 178వ బూత్‌లో పార్టీ జెండాను నల్లగొండ మండల అధ్యక్షుడు బోగరి అనిల్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, శ్రీకాంత్, శంకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహ తదితరులు సందీప్ పాల్గొన్నారు.

కేతేపల్లిలో..

కేతేపల్లి: మండలంలోని గుడివాడలో బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ బూత్ అధ్యక్షుడు కోళ్ల సందీప్, పగిళ్ల దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి, మాజీ సర్పంచ్ గోలి క్రిష్ణయ్య, నాయకులు రాచకొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చండూరు, గట్టుప్పల్ మండలాల్లో..

చండూరు: చండూరు, గట్టుప్పల్ మండలాల పరిధిలో శనివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సోమ నరసింహ, కోమటి వీరేశం, సముద్రాల వెంకన్న, భూతరాజు శ్రీహరి, తడకమల్ల శ్రీధర్, ఇరిగి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో టిఫిన్ బైఠక్..

చిట్యాల: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చిట్యాల మున్సిపాలిటీలో, మండలంలోని వెలిమినేడు, పెద్దకాపర్తి గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేశారు. పెద్దకాపర్తిలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, వెలిమినేడులో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు అంశాల అనిల్‌కుమార్, బూత్ అధ్యక్షుడు కానుగుల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో, చిట్యాలలోని పదో వార్డు 100వ పోలింగ్ బూత్‌లో పార్టీ జిల్లా నాయకుడు చికిలంమెట్ల అశోక్ ఆధ్వర్యంలో, 105వ పోలింగ్ బూత్‌లో, 111 పోలింగ్ బూత్‌లో టిఫిన్ బైటక్ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీనియర్ నాయకులను సన్మానించారు. కార్యక్రమాలలో మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహాగౌడ్, చిట్యాల మున్సిపాలిటీ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీను, నాయకులు జయరాపు రామకృష్ణ, ఖమ్మంపాటి సతీష్, పురం ప్రశాంత్, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చండూరు పట్టణ కేంద్రంలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



చిట్యాల మున్సిపాలిటీ పదో వార్డులో టిఫిన్ బైటక్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు



కేతేపల్లి: గుడివాడలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

హక్కుల పరిరక్షణకు ఏకం కావాలి



నల్లగొండ టౌన్: రణదీవె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ టౌన్: తమ హక్కుల పరిరక్షణ కోసం కార్మికవర్గం ఏకం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవె వర్ధంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో అద్దంకి నర్సింహ, పోలె సత్యనారాయణ, సలివోజు సైదాచారి, మారయ్య, రవి, వీరయ్య, బక్కయ్య, నాగరాజు, వెంకన్న, సతీష్, అశోక్, నర్సింహ పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ: బీటీ రణదీవె వర్ధంతి సందర్భంగా మర్రిగూడ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో కార్మిక సంఘాలను ఐక్యం చేసిన గొప్ప వ్యక్తి రణదీవె అని అన్నారు. కార్యక్రమంలో నీలకంఠం రాములు, వంపు ముత్తమ్మ, గ్యార దుర్గమ్మ, యాదగిరి, యాచారం జంగమ్మ, హేమలత, ఇందిరమ్మ, నర్సమ్మ, రాములు పాల్గొన్నారు.

పచ్చళ్ల తయారీపై మహిళలకు శిక్షణ



కట్టంగూర్: పచ్చళ్ల తయారీపై శిక్షణ ఇస్తున్న హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త జ్యోతి

కట్టంగూర్: మండలంలోని అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధి గంగదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీలో శనివారం 90 మంది మహిళలకు నాబార్డ్ సహకారంతో నిమ్మకాయ పచ్చడి, టమాటా పచ్చడి, మామిడికాయ పచ్చడి తయారీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త జ్యోతి పాల్గొని పచ్చళ్ల తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ చైర్మన్ చెవుగోని సైదమ్మ, నకిరేకల్ నియోజకవర్గ ఉద్యానవన అధికారి రావుల విద్యాసాగర్ ఉన్నారు.

స్వయం ఉపాధి మార్గాలపై..

నల్లగొండ టౌన్: రేకల అన్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని గ్రేస్ ఇవాంజెలికల్ బాప్టిస్ట్ చర్చిలో శనివారం నిరుద్యోగ యువతులకు ఫినాయిల్, సబ్బులు, జెండూబాం, వ్యాజిలిన్ తయారీపై రెవరెండ్ పి. జాన్‌బాబు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్, అధ్యక్షుడు రేకల భద్రాద్రి మాట్లాడుతూ.. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రేకల శైలజ, రేఖల సునీల్, సుధామ్స్, రెవరెండ్ డాక్టర్ కె. మోజెస్, రెవరెండ్ కె. ఝెవెలు, కె. శేఖర్, పాస్టర్లు వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్మ సంరక్షణపై అవగాహన

నల్లగొండ రూరల్: ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో శనివారం గ్రామస్తులకు కామినేని వైద్య కళాశాల ఆధ్వర్యంలో చర్మ సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కామినేని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శృతి మహంతి మాట్లాడుతూ.. చర్మంపై మచ్చలు, రంగు మార్పు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. చర్మ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు బాలరాజు, అశోక్‌దేవ్, నేహా, నవనీత, దివ్య ,శ్రీముఖి, బి. దివ్య, అమీనా నాజ్, రమేష్, నగేష్, దేవకుమారి పాల్గొన్నారు.